# నేడు అనువంశిక అర్చకుల సమావేశం

- అనువంశిక అర్చక పురోహితులతో అర్చక పోస్టులను భర్తీ చేయాలి
- దేవస్థానం విస్తరణ పనుల్లో, వీటీడీఏలో భాగస్వామ్యం కల్పించాలి

వేములవాడ టౌన్, ఏప్రిల్ 12 : వాములవాడ రాజన్న దేవస్థానానికి చెందిన 128 మంది అనువంశిక కుటుంబాల అర్చకుల సర్వసభ్య సమావేశం ఆదివారం శంకరమఠంలో నిర్వహించనున్నట్లు సంఘం సభ్యులు వెల్లడించారు. దేవస్థానాన్ని సుమారు రూ. 70 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో విస్తరణ చేపడుతున్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి గతేడాది నవంబర్ 20న దేవస్థానానికి స్వయంగా విచ్చేసి విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. యాదగిరిగుట్ట దేవస్థానాన్ని సుమారు రూ.1200 కోట్లు భారీ బడ్జెట్‌తో విస్తరణ పనులను చేపట్టింది. అదే తరహాలో 2015 నుంచి రాష్ట్ర తొలి సీఎం చంద్రశేఖర్‌రావు వేములవాడ దేవస్థానంలో వీటీడీఏ ఆధ్వర్యంలో విస్తరణ పనులకు సుమారు రూ. 400 కోట్లతో శ్రీకారం చుట్టారు. ప్రతి ఏటా బడ్జెట్‌లో రూ. 100 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించి, అభివృద్ధి పనులను కొంత వరకు నిధులు మంజూరు చేసి, చేపట్టారు. సుమారు రూ. 30 కోట్ల అంచనా వ్యయంతో 30 ఎకరాల ప్రైవేట్ భూములను స్వీకరించారు. వేములవాడ గుడి చెరువులోని 30 ఎకరాలను దేవస్థానం అభివృద్ధి పనులకు విస్తరణకు వాడడానికి ప్రణాళికలు రూపొందించారు. మూడేళ్లపాటు కరోనా రావడం, ప్రభుత్వాలు మారడంతో అరకొర నిధుల కొరతతో దేవస్థానం విస్తరణ పనులు వాయిదాపడ్డాయి. జూన్ 15 నుంచి వేములవాడ భీమేశ్వరాలయాన్ని బాలలయంగా తీర్చిదిద్దుతున్నట్లు అధికారులు ప్రకటించారు. దేవస్థానంలో అనువంశిక అర్చకత్వం 1200 సంవత్సరాల నుంచి కొనసాగుతున్నది. దేవస్థానం శైవాలయమైనందున శృంగేరి పీఠం వారి ఆధీనంలో ఉన్నది. ఇక్కడ సుమారు 40 మంది వరకు స్కేల్ వేతనాలతో అనువంశిక అర్చకులు పనిచేస్తున్నారు. దాదాపు 200 మంది అనువంశిక అర్చకులు పురోహితులుగా స్వచ్ఛందంగా ఆలయంలోని ప్రతి రోజూ పూజలకు హాజరవుతూ, ఇతర దేవస్థానం వారి ముఖ్య కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నారు. 1970–74 ప్రాంతంలో దేవస్థానాన్ని విస్తరించినప్పుడు స్థానిక అనువంశిక అర్చక ప్రతినిధులను భాగస్వామ్యం చేసుకొని, ఆగమ సలహాలను తీసుకొని అభివృద్ధి పనులను పూర్తిచేశారు. పుష్పగిరి పీఠాధిపతులు స్వయంగా వచ్చి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం వేములవాడ దేవస్థానంలో శృంగేరి పీఠాధిపతుల సలహాలతో విస్తరణ కార్యక్రమాలను చేపడుతున్నారు. శృంగేరి పీఠాధిపతులకు ఇక్కడి అనువంశిక అర్చక సమస్యలు, తెలువకపోవడంతో విస్తరణ కార్యక్రమాలపై స్థానిక అర్చకులు తమ ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. దేవస్థానం అధికారులు, దేవాదాయ శాఖ అధికారులు ఇక్కడి ప్రజాప్రతినిధులు అనువంశిక అర్చకుల సంఘం ప్రతినిధులతో పనుల విషయమై చర్చించకుండా విస్తరణ పనులను చేపట్టడానికి ముందుకు రావడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి వాస్తవ సమస్యలను శృంగేరి పీఠాధిపతులకు నివేధించడానికి సన్నద్ధం అవుతున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్న ప్రభాకర్, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాష్ట్ర రెవెన్యూ ఎండోమెంట్ సెక్రటరీ శ్రీమతి శైలజా రామయ్యార్‌ను, స్థానిక ఎంపీ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ని కలిసి తమ సమస్యలను నివేదించాలని విస్తరణ కార్యక్రమాల్లో తమను విధిగా భాగస్వామ్యం చేయాలని కోరుతున్నారు. అనువంశీక అర్చకత్వాన్ని ఆంధ్రాలో లాగా పెద్ద దేవాలయాలకు పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. అనువంశిక అర్చక ట్రస్ట్ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మామిడిపెల్లి రాజన్న, యువజన నాయకుడు పురాణం రాము ఈ సమావేశానికి అర్చకులు, పురోహితులు, భాగ్యనగర్ అనువంశీక అర్చక కుటుంబాల సభ్యులు సమావేశానికి తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

# పురాతన శిల్పాలను కాపాడుకోవాలి

- పురావస్తు పరిశోధకుడు పేచే ఇండియా ఫౌండేషన్ సీఈవో శివనాగిరెడ్డి


భీమేశ్వరాలయంలో వృథాగా పడిఉన్న శిల్పాలను పరిశీలిస్తున్న సిబ్బంది

వేములవాడ టౌన్, ఏప్రిల్ 12 : పురాతన అపురూప శిల్పాలను కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, పేచే ఇండియా ఫౌండేషన్ సీఈవో డా. ఈమని శివనాగేంద్ర సూచించారు. శనివారం స్థానిక చరిత్రకారులు, రచయిత సంకేపల్లి నాగేంద్రశర్మ ఇచ్చిన సమాచారం మేరకు.. ఆయన వేములవాడ పరిసరాల్లో విస్తృతంగా పర్యటించి, అనేక చారిత్రక ఆనవాళ్లను, శిల్పాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భీమేశ్వరాలయంలో ఆలనా పాలనా లేకుండా అపురుప శిల్పాలున్నాయని, వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆవేధన వ్యక్తం చేశారు. వెయ్యేళ్లనాటి శిల్పాలను కాపాడుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. క్రీ.శ 9వ శతాబ్ధినాటి గణేశ, చాముండి, సప్తమాతలు, శివలింగాలు, నంది, కుబేర, జైన మహావీర, పార్శ్వనాథ చౌముఖీ శిల్పాలు చిందరవందరగా పడేసి ఉన్నాయన్నారు. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఈ శిల్పాలను అదే ఆలయ ప్రాంగణంలో వరుసక్రమంలో, పీఠాలపై నిలబెట్టి, చారిత్రక వివరాలతో చిన్నసైజు పేరు పలకలను ఏర్పాటు చేసి భావి తరాలకు అందించాలని, ఆలయ అధికారులు, వేములవాడ మున్సిపాలిటీ అధికారులకు శివనాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట ప్రముఖ చరిత్రకారుడు సంకేపల్లి నాగేంద్రశర్మ తదితరులు ఉన్నారు.

## డీటీఎఫ్ ఆధ్వర్యంలో చలివేంద్రం

గంభీరావుపేట, ఏప్రిల్ 12 : మండలకేంద్రంలోని స్థానిక బస్టాండులో డీటీఎఫ్ ఉపాధ్యాయ మండల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం సీఐ శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉన్నందున బస్టాండులో ప్రయాణికుల దాహార్తిని తీర్చడానికి గాను డీటీఎఫ్ సంఘ ఉపాధ్యాయులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని సీఐ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గంగారాం, ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎర్ర సత్యానారాయణ, మండలాధ్యక్షుడు శీలాకుమార్, ప్రధాన కార్యదర్శి దోసల మధు, ఉపాధ్యాయులు బాలెల్లయ్య, విష్ణుప్రసాద్, శ్రీనివాస్, ఆనందం, తిరుపతిరెడ్డి, భరత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## 20 నుంచి ఇంటర్, పదో తరగతి ఓపెన్ పరీక్షలు

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ) ఈ నెల 20 నుంచి నిర్వహించనున్న ఇంటర్, పదో తరగతి ఓపెన్ పరీక్షలకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంటర్ పరీక్షల కోసం జిల్లాలో 4 సెంటర్లు ఏర్పాటు చేశారు. అందులో సిరిసిల్లలో 2, వేములవాడలో 2 ఉన్నాయి. పదో తరగతి ఓపెన్ స్కూల్ పరీక్ష కోసం సిరిసిల్లలో ఒక సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఇంటర్ పరీక్షకు 995 మంది, పదో తరగతి 264 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు అధికారులు తెలిపారు. వేసవీ దృష్ట్యా పరీక్షా కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, ప్రాథమిక ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఫ్లయింగ్, సిట్టింగ్‌స్క్వాడ్‌ను నియమించనున్నారు.

# యువత క్రీడల్లో రాణించాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న మాజీ ఎంపీటీసీ, యువ నాయకులు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 12 : యువత క్రీడల్లో రాణించాలని మాజీ ఎంటీసీ ఒగ్గు సర్సయ్య సూచించారు. మండల కేంద్రంలో నెల రోజులుగా జరుగుతున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా టెన్నీస్, క్రికెట్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా విజేతలకు బహుమతి ప్రదానోత్సవానికి హాజరై ఆయన మాట్లాడారు. గ్రామీణ క్రీడాకారులకు ఇలాంటి వేదిక తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండడాలన్నారు. ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచిన ఎలగందుల జట్టుకు మండల యువజన సంఘం అధ్యక్షుడు అమరేందర్ రూ. 20 వేల నగదును అందజేశారు. రన్నర్‌గా నిలిచిన తంగళ్లపల్లి జట్టుకు ఓగ్గు నర్సయ్యా రూ. 10 వేల నగదును అందజేశారు. యువ నాయకుడు అమరేందర్‌ను పలువురు అభినందించారు. బహుమతులను మండల స్పోట్స్ క్లబ్ అధ్యక్షుడు మామిడి రాజు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ కూనబోయిన బాలరాజు, కొత్త శ్రీనివాస్ రెడ్డి, గొడుగు నర్సయ్య, వినయ్, శ్రావన్, గౌతమ్, సుమన్, జనార్దన్ తదితరులున్నారు.

## జిల్లావాసికి అరుదైన పురస్కారం


ఎంపికైన సతీశ్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 12 : జిల్లా కేంద్రానికి చెందిన మాసం సతీష్‌రెడ్డి అరుదైన పురస్కారానికి ఎంపికయ్యారు. చిత్ర పరిశ్రమలో ఆయా రంగాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి ఏటా దాసరి ఫిల్మ్ అవార్డ్సను అందిస్తుంటారు. కాగా, ఇటీవల విడదలై విజయాన్ని సాధించిన 'క' చిత్రానికి సతీశ్‌రెడ్డి కెమెరామెన్‌గా పనిచేశారు, అదేవిధంగా సమ్మతమే, కే రాంప్ చిత్రాలకు డీవోపీగా పనిచేసినందుకు గానూ దాసరి యువ ప్రతిభ అవార్డు–2025కు ఎంపిక చేసినట్లు అవార్డ్స కమిటీ ఫౌండర్ చైర్మన్ తుమ్మలపల్లి రామసత్యానారాయణ, అవార్డు కమిటీ సభ్యులు తమ్మారెడ్డి భరద్వాజ, సీ కల్యాణ్, నరసింహరావు, జర్నలిస్టు ప్రభుత్వ తెలిపారు. మే 1న హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో నిర్వహించే అవార్డు ప్రధానోత్సవంలో సతీష్‌రెడ్డి దాసరి యువ ప్రతిభ అవార్డును అందుకునున్నారు. సిరిసిల్ల పట్టణానికి చెందిన సతీష్‌రెడ్డి దాసరి అవార్డుకు ఎంపికకావడంపై జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పొత్తూరులో వేంకటేశ్వర స్వామి జాతర

ఇల్లంతకుంట, ఏప్రిల్ 12 : పొత్తూరులో శనివారం వేంకటేశ్వర స్వామి జాతర ఉత్సవాల్లో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు పాల్గొన్నారు. ఎడ్ల బండ్ల ర్యాలీలో గ్రామస్తులతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉత్సవాలకు భక్తు లు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్టు

బోయినపల్లి,ఏప్రిల్12: మండలంలోని మల్లాపూర్ శివారు మానేరు వాగులో పేకాటాడుతున్నారన్న సమాచారం మేరకు.. పోలీసులు దాడులు చేయగా పేకాటాడుతున్న ఆరుగురిని పట్టుకొని వారి వద్ద నుంచి రూ. 8200 నగదు, ఆరు సెల్‌ఫోన్లు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పృథ్వీదర్ గౌడ్ తెలిపారు.

## మహిళల అభివృద్ధే లక్ష్యం : ప్రభుత్వ విప్


చందుర్తి : కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

చందుర్తి,ఏప్రిల్ 12 : మహిళా అభివృద్ధే లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలకేంద్రంతో పాటు కిష్టంపేటలో శనివారం ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రభు త్వం పని చేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 శాతం కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు కేటాయించారని వెల్లడించారు. అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస్, మార్కెటింగ్ డీపీఎం శ్రీనివాస్, ఐకేపీ ఏపీఎం రజిత, సీసీలు వనజ, శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, వైస్ చైర్మన్ మల్లేశం, మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, నాయకులు చింతపంటి రామస్వామి, రైతులు గ్రామస్తులు ఉన్నారు.

### ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

బోయినపల్లి, ఏప్రిల్ 12 : మండలంలోని కోరెం ప్యాక్స్ పరిధిలో ఆనంతపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝూతో కలిసి చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, దళారులను నమ్మిమోస పోవద్దని సూచించారు. అనంతరం గ్రామంలో చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. మండల అధికారులు, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

## సిరిసిల్ల ఆయుర్వేద మూలిక వైద్యుడికి సన్మానం


కమలాకర్‌ను సన్మానిస్తున్న విశ్వంభర చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

కలెక్టరేట్, ఏప్రిల్ 12 : విశ్వంభర చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 11న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలో ఆయుర్వేద వైద్యుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో వివిధ రాష్ట్రాల నుంచి ఆయుర్వేద వైద్యంలో సిద్ధహస్తులు పాల్గొన్నారు. కాగా, విశ్వంభర చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు ఆయుర్వేద వైద్యంతో ప్రజలకు విశేషమైన సేవలు అందిస్తున్న వారిని గుర్తించి సత్కరించారు. దీనిలో భాగంగా సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్‌కు చెందిన ఆయుర్వేద వైద్యుడు జిందం కమలాకర్ కొనేళ్లుగా ఆయుర్వేద వైద్యంతో ప్రజలకు అందిస్తున్న సేవలను గుర్తించి ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ, ఆయుర్వేద మూలికా వైద్యంతో దీర్ఘకాలక వ్యాధులు కూడా నయమవుతాయన్నారు. మూలికా విజ్ఞానాన్ని తెలుసుకునేలా తన వంతు కృషి చేస్తున్నానన్నారు. త్వరలోనే సిరిసిల్లలో ఆయుర్వేద మూలిక విజ్ఞాన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. తన సేవలను గుర్తించి సత్కరించిన విశ్వంభరా చారిటబుల్ ట్రస్ట్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.


బాలుడి వీపుపై గాయం

## విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడు

గంభీరావుపేట, ఏప్రిల్ 12 : విద్యాలయంలో పాఠాలు బోధిస్తూ విద్యా బుద్ధిలు నేర్పాల్సిన ఉపాధ్యియుడే విద్యార్థి వీపుపై చితకబాదడంతో తీవ్రగాయాలైన ఘటన గంభీరావుపేటలో జరిగింది. మండల కేంద్రంలోని కేజీ టూ పీజీ విద్యాలయం ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న లవణ్‌సాయి విద్యార్థిని శనివారం ఉపాధ్యాయుడు దేవరాజు చితకబాదాడు. విద్యార్థి ఎలాంటి తప్పు చేయకున్నా సంబంధం లేకుండా కొట్టడంపై తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని ఉపాధ్యాయుడుపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో విద్యార్థి తండ్రి రమేశ్ ఫిర్యాదు చేశారు. విద్యార్థిని చితకబాధిన ఉపాధ్యాయుడుపై ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.

## 'సంస్కృతం' ద్వితీయ భాష సరికాదు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 12: ఇంటర్ విద్యలో ద్వితీయ భాషగా ప్రభుత్వం పెట్టిన ఉత్తర్వులు సరికాదని తెలంగాణ వివేక రచయితల సంఘం అధ్యక్షుడు వీ పరశురాములు అన్నారు. శుక్రవారం రీజనల్ జా యింట్ డైరెక్టర్ ఇంటర్‌లో సంస్కృతం ద్వితీ య భాషగా ఉత్తర్వులు జారీ చేయగా, దా న్ని ఖండించి మాట్లాడారు. అది తెలుగు భాషకు గొడ్డలిపెట్టు లాంటిదని తెలుగులోనే విద్యార్థుల్లో మానసిక వికాసం జరుగుతుందన్నారు.

## గ్రామగ్రామాన బీఆర్ఎస్ రజతోత్సోవ వాల్ రైటింగ్స్


గ్రామాల్లో బీఆర్ఎస్ రజతోత్సోవ వాల్ రైటింగ్స్ రాయిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బోయినపల్లి, ఏప్రిల్ 12 : చొప్పదండి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పిలుపు మేరకు.. మండల నాయకులు శనివారం పలు గ్రామాల్లో బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ గోడలపై రాయించారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు, మండల మాజీ కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ అజ్జు, గుంటి శంకర్, కమలాకర్, బోయిని రాజు తదితరులు ఉన్నారు.


నమస్తే తెలంగాణ CLASSIFIED

HOUSE FOR SALE



★ కమర్షియల్ బిల్డింగ్ అమ్మబడును, కరీంనగర్ విద్యారణ్యపురి రోడ్ నెం–1 లోని ఆర్యన్ హాస్పిటల్ వెనుక బిల్డింగ్ 4 గుంటలు అమ్మబడును. Cont: ఆర్యన్ హాస్పిటల్ నందు సంప్రదించగలరు. NTK-337576

VEHICLE FOR SALE

★ Vehicle for Sale: MARUTI ALTO VXI BS VI, Petrol Vehicle Modal: 2022 NO: TS02FH8553 Contact: Indusind Bank Cell: 9542582921 NTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.




మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189


## నూతన నియామకం

మేడిపల్లి, ఏప్రిల్ 12 : భీమారం మండలం దేశాయిపేటకు చెందిన నాంచారి రాజేందర్‌ను జాతీయ బీసీ సంక్షేమ సంఘం భీమారం మండలాధ్యక్షుడిగా నియమించి నట్లు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాజన్న సిరిసిల్లా అధ్యక్షుడు మ్యాకల పర్శరాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాంచారి రాజేందర్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దురిశెట్టి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు.

# ఘనంగా హనుమాన్ జయంతి

### అగ్రహారం హనుమాన్ ఆలయంలో ప్రభుత్వవిప్ పూజలు

వేములవాడ రూరల్, ఏప్రిల్ 12 : మండలంలోని అగ్రహారం హనుమాన్ ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి, రథోత్సవం కనుల పండువలా జరిగింది. స్వామివారిని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో నాగారం శ్రీనివాస్ ఆది శ్రీనివాస్‌ను శాలువాతో సన్మానించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. స్వామివారిని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ రాకేశ్, నాయకులు పిల్లి కనుకయ్య, ఎర్రం రాజు పాల్గొన్నారు.


రుద్రంగి: స్వామివారికి ప్రత్యేక పూజలు చేస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, హనుమాన్ దీక్షాపరులు

రుద్రంగి, ఏప్రిల్ 12 : మండలంలోని దేగావత్‌తండాలోని హనుమాన్ ఆలయంలో పూజారులు ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తిరుపతి, నాయకులతో పాటు హనుమాన్ దీక్షాపరులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఐసీడీఎస్‌లో పదోన్నతుల పేరిట పైసా వసూల్!

- జిల్లాలో ఓ యూనియన్ నాయకుల బరితెగింపు
- అంగన్‌వాడీ ఆయాలకు టీచర్లుగా అర్హత ప్రకారం ప్రమోషన్ వచ్చినా తామే ఇప్పించామని బురిడీ
- అధికారుల ఖర్చుల పేరు చెప్పి డిమాండ్
- ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష చొప్పన వసూలు
- నిజం తెలిసి నిలదీసిన బాధితులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 12: ఐసీడీఎస్‌లో పదోన్నతుల పేరిట పలువురు యూనియన్ నాయకులు పైసా వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల జిల్లాలో 12 మంది అంగన్‌వాడీ ఆయాలకు టీచర్లుగా ప్రమోషన్లు వచ్చిన విషయం తెలిసిందే. అయితే ఆ పదోన్నతులు అర్హత మేరకు రాగా, తామే ఇప్పించామని సదరు నాయకులు కటింగ్ ఇస్తూ అధికారుల ఖర్చుల కింద డబ్బులు ఇవ్వాలని చెప్పి ఒక్కొక్కరి వద్ద రూ.లక్ష చొప్పున వసూలు చేసినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. 'సాక్ష్యం అంగన్‌వాడీ స్కీం–2022' జిల్లాలో 2022 సంవత్సరం వరకు పదేండ్లపాటు అంగన్‌వాడీ పాఠశాలల్లో ఆయాలుగా సేవలందించి పదో తరగతి ఉత్తీర్ణత ఉన్న వారికి టీచర్లుగా పదోన్నతుల కోసం గతంలో జీవో వచ్చింది. దీంతో అర్హత మేరకు జిల్లాలో 12 మంది టీచర్లుగా ప్రమోషన్ పొందారు. ఓ యూనియన్‌కు చెందిన ఇద్దరు జిల్లా స్థాయి నేతలకు ఈ విషయం తెలియడంతో ఇదే అదనుగా డబ్బులు వసూలు చేయాలని భావించారు. మండలస్థాయిలో పలువురు యూనియన్ నేతలపై సదరు వ్యక్తులు ఒత్తిడి తెచ్చి 'తామే పదోన్నతి ఇప్పించామని, ఖర్చులుంటాయని, అధికారులకు డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పి' డబ్బులు వసూలు చేయాలని సూచించారు. దీంతో సదరు నాయకులు పదోన్నతి పొందిన పలువురు టీచర్ల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.లక్ష వసూలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

### జిల్లా అధికారి దృష్టికి విషయం

అయితే పదోన్నతి పొందిన టీచర్లకు కొద్ది నెలలుగా జీతాలు రాకపోవడంతో జిల్లా స్థాయి అధికారి వద్దకు వెళ్లి, త్వరగా ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే వస్తాయని సదరు అధికారి వారికి తెలిపారు. ఇంకా పదోన్నతి వచ్చిన సందర్భంగా స్టాఫ్‌కు మంచి భోజనం పెట్టించాలని సదరు అధికారి చెప్పడంతో టీచర్లు కంగుతిన్నారు. అప్పటికే తాము అధికారుల కోసం యూనియన్ నాయకులకు డబ్బు ఇచ్చామని, మళ్లీ భోజనాలు ఏంటి..? అని.. విషయాన్ని సదరు పెద్దాఫీసరు చెవిలో వేయగా, ఆశ్చర్యపోయినట్లు సమాచారం. తమ పేరు చెప్పి డబ్బులు ఎలా వసూలు చేస్తారని.. మీరు ఎందుకు ఇచ్చారని, మీకు అర్హత ప్రకారమే ప్రమోషన్లు వచ్చాయని, ఇందులో ఎవరి పైరవీ లేదని, మీ డబ్బులు వసూలు చేసుకోవాలని సదరు అధికారి సూచించినట్లు తెలిసింది. దీంతో సదరు టీచర్లు యూనియన్ నాయకులను నిలదీశారని, డబ్బులు రాబట్టుకునేందుకు గట్టిగానే ఫైట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై సూపర్‌వైజర్ గుమ్మడి కళావతిని వివరణ కోరగా, తాను ఇటీవలే మండలానికి వచ్చానని, అప్పటికే ఇక్కడ ముగ్గురు ఆయాలు అర్హత ప్రకారమే ప్రమోషన్ పొందారని చెప్పారు. డబ్బుల వసూలు చేసిన విషయం తమకు తెలియదని వివరించారు.

## పోషణ పక్షంపై అవగాహన


మాట్లాడుతున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శంకరమ్మ

బోయినపల్లి , ఏప్రిల్ 12 : మండలంలోని మల్లాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణపక్ష కార్యక్రమాన్ని శనివారం సూపర్‌వైజర్ శంకరమ్మ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గర్భిణీ, బాలింత, పిల్లలకు పోషకాహారం, పరిశుభ్రత వంటి జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ ఆరుంధతి, హెల్త్ సూపర్‌వైజర్ ఉమాకళావతి, ఏఎన్ఎం పుష్పలత, సులోచన, ఆశ కార్యకర్త శారధ ఉన్నారు.

## విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు దేవదాస్

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 12 : పట్టణంలో ఈ నెల 14న నిర్వహించనున్న అంబేద్కర్ జయంతి జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం సిరిసిల్లలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పండుగ వాతావరణంలో అంబేద్కర్ జయంతిని నిర్వహించాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. మాజీ కౌన్సిలర్ లింగంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ, కలెక్టర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద జరుగుతున్న అంబేద్కర్ జయంతి వేడుకలకు ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం మారణకాండ సృష్టించి మనుధర్మం తెచ్చేవిధంగా కుట్ర చేస్తుందన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలన్న ఆలోచనను తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో అంబేద్కర్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొత్తపల్లి సుధాకర్, కార్యదర్శి ఆవునూరి వెంకటరాములు, లింగంపల్లి సత్యనారాయణ, తంగళ్లపల్లి దేవయ్యా, పంగ రవి, కత్తెర వరుణ్‌కుమార్, తంగళ్లపల్లి మహేశ్, మధు, శివ, రాజు పాల్గొన్నారు.

## తండ్రిని చంపిన తనయుడి అరెస్టు

- 24 గంటల్లో పట్టుకున్న పోలీసులు
- రిమాండ్‌కు తరలింపు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 12 : మండల కేంద్రానికి చెందిన కుంచెపు కనకయ్యను అతడి కుమారుడు పరశురాములు శుక్రవారం కర్రతో దాడి చేసిన ఘటనలో తండ్రి మృతి చెందగా, పరశురాములు పరారయ్యాడు. దీంతో నిందితుడిని 24 గంటల్లో పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రమాకాంత్ శనివారం తెలిపారు. పర్శరాములును సీఐ శ్రీనివాస్‌గౌడ్ టెక్నికల్ ఎవిడెన్స్ ద్వారా ఎల్లారెడ్డిపేట వచ్చినట్లు గుర్తించి పోలీసులను అలర్టు చేశారు. కొత్త బస్టాండు వద్ద ఆయనను పట్టుకున్నారు. మర్డర్ చేసేందుకు వాడిన కర్రను స్వాధీనం చేసుకొని జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.